ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
గురువారం 19 డిసెంబరు 2024





వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారంలో ముందస్తు మొక్కులు

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో భక్తుల ముందస్తు మొక్కులు మొదలయ్యాయి. మినీజాతరకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో భక్తుల అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం 10వేల మందికి పైగా భక్తులు మేడారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్నారు. అమ్మవార్లకు పూలు, పండ్లు, పసుపు కుంకుమ చీరె సారెలు కొబ్బరికాయలు బెల్లం, యాట మొక్కులు సమర్పించారు.

- మేడారం, ఆంధ్రజ్యోతి



కమ్ముకున్న మంచు..

ప్రధాన రహదారిని కమ్మేసిన మంచు


చలి తీవ్రత పెరిగింది. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా మంచు దుప్పటి కమ్మేస్తోంది. తెల్లవారుజామున కురుస్తున్న మంచుతో రహదారులు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులుగా జిల్లాలో రాత్రి ఉష్ణోగ్రతలు 12 డిగ్రీలకు పడిపోవడంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. వాహనదారులు ఉన్ని దుస్తులు ధరించి ప్రయాణాలు చేస్తుండగా.. ప్రజలు చలిమంటలు కాగుతూ ఉపశమనం పొందుతున్నారు.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి

చలికాలంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది..

- రోగాలు చుట్టుముట్టే ప్రమాదం ఎక్కువ
- సొంత చికిత్స వద్దు.. వైద్యులను సంప్రదించాలి
- ఎంజీఎం జనరల్ ఫిజిషియన్ డాక్టర్ వైద్యం గౌతం

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన



'చలికాలంలో వ్యాధి నిరోధక శక్తి క్రమంగా తగ్గుతుంది. ఫలితంగా రోగాలు చుట్టుముడతాయి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు ఎక్కువగా అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంటుంది. ఈ క్రమంలో సొంత వైద్యం పాటించకుండా వైద్యుల సలహాలతో చికిత్స పొందాలి. సమతుల్య, తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడంతో పాటు చలి నుంచి రక్షణగా పలు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మనల్ని మనం కాపాడుకోవచ్చు. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధ, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు, సమస్యలున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలి' అని వరంగల్ ఎంజీఎం జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వైద్యం గౌతం సూచించారు. చలికాలంలో వచ్చే వ్యాధులు, చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి అనేక మంది కాల్ చేయగా వారికి డాక్టర్ గౌతమ్ సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు.. పలు సందేహాలను నివృత్తి చేశారు.

- వరంగల్ మెడికల్, ఆంధ్రజ్యోతి

7



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న పీవో చిత్రామిశ్రా

ఐటీడీఏ పీవో ఆశ్రమ పాఠశాల సందర్శన

కన్నాయిగూడెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలురు పాఠశాలను ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా బుధవారం సందర్శించారు. పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, హిందీ పండిట్‌తో పాటుగా ప్రాథమిక విద్య బోధించడానికి ఉపాధ్యాయులు లేరని, పాఠశాలలో సరైన విద్యుత్ సరఫరా లేద ని, పలు సమస్యలు పెం డింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సమస్యల నిర్వ హణ కోసం సిబ్బంది ఇప్పటికే 50వేలు సొంతంగా ఖర్చు చేసినట్లు పీవో దృష్టికి ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. పీవో సానుకూలంగా స్పందించి వీలై నంత త్వరగా మరమ్మ తులు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో పాఠాలు బంద్..

సమ్మె బాటలో ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది

మొగుళ్లపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని కొరికిశాల గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఉపాధ్యాయులు సమ్మెబాట పట్టడంతో విద్యార్థినులకు పాఠాలు చెప్పేవారు కరువయ్యారు. సిలబస్ పూర్తవుతుందో లేదోనని విద్యార్థినులు ఆందోళనకు గురవుతున్నారు. సమగ్రశిక్షా ఉద్యోగులు, సిబ్బంది తమ సమస్యల పరిష్కారానికి ఈ నెల 6 నుంచి సమ్మె చేస్తున్నారు. మండలకేంద్రంలోని ఎంఈవో కార్యాలయం పనులు స్తంభించగా కార్యాలయానికి తాళం పడింది. భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉపాధ్యాయులు, నాన్‌టీచింగ్ సిబ్బంది నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. 15వరోజు బుధవారం సమ్మె కొనసాగింది. కేజీబీవీలోని విద్యార్థినులకు భోజనంతోపాటు ఇతర విషయాల్లో ఇబ్బందులు పడకుండా నాన్‌టీచింగ్ సిబ్బందితో నెట్టుకొస్తు న్నారు. వచ్చేనెలలో ఎఫ్ఏ-3 పరీక్షలు నిర్వ హించాల్సి ఉండగా పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. దీంతో విద్యార్థినులకు ప్రత్యేక కార్యాచరణతో తరగతులు నిర్వహిస్తుండగా సబ్జెక్టులు పూర్తిగా వెనుకబడి పోవడంతో పరీక్ష ఫలితాలపై ప్రభావం చూపనుంది.

- పట్టించుకోని పంచాయతీ, పోలీసులు
- జాతీయ రహదారి పైనా జబర్దస్తీగా దందా
- ఇసుక లారీలను వదలని వైనం
- నిబంధనలు కాదని కాంట్రాక్టర్ మనుషుల దాష్టీకం



ఇదేం దోపిడీ?

కాళేశ్వర ఆలయ క్షేత్రంలో అడ్డగోలు వసూళ్లు

(ఆంధ్రజ్యోతి, భూపాలపల్లి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిత్యం వేలాది మంది భక్తులు వచ్చి వెళ్లే ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో వాహన ఎంట్రీ, పార్కింగ్ కాంట్రాక్ట్‌ను దక్కించుకున్న ఓ వ్యక్తి పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నారు. కేవలం ఆలయ క్షేత్రం, గోదావరి తీర ప్రాంతాల్లో తప్ప ఎక్కడ ఫీజులు వసూలు చేయవద్దన్న నిబంధనలు స్పష్టంగా ఉన్నా సదరు కాంట్రాక్టర్ మాత్రం ఏకంగా జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే అంతర్ రాష్ట్ర వాహనాలను, గోదావరి నుంచి నిత్యం ఇసుకను తరలించే వందలాది లారీల నుంచి కూడా దారిదోపిడికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకునేందుకు నిత్యం భక్తులు వాహనాల్లో కాళేశ్వరానికి తరలివస్తుంటారు. తెలంగాణ ప్రాంతం నుంచే కాకుండా అటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు వచ్చి వెళ్తుంటారు. అయితే ఆలయ క్షేత్రంలో వాహనాల పార్కింగ్ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల ఇక్కడ తరచూ ట్రాఫిక్ సంబంధిత సమస్యలు ఉత్తమవుతున్నాయి. దాంతో ఈ సమస్యను పరిష్కరించడమే కాకుండా గ్రామపంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్న లక్ష్యంతో పంచాయతీరాజ్ శాఖ ఓ నిర్ణయానికి వచ్చి వాహనాల ఎంట్రీ, పార్కింగ్ మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈ పనిని కాంట్రాక్టర్‌కు అప్పగించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో నవంబర్ 14న జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పార్కింగ్ ఏర్పాటు చేసుకొని ఫీజులు వసూలు చేసుకునేందుకు వీలుగా గ్రామపంచాయతీ వేలంపాట నిర్వహించింది. ఈ వేలం పాటలో నాగరాజు అనే వ్యక్తి ఆరు లక్షల 36 వేల మొత్తానికి టెండర్ దక్కించుకున్నారు. నవంబరు 15నుంచి 31 మార్చి 2025 వరకు మొత్తం మూడు నెలల 15రోజుల కాలానికి ఫీజులు వసూలు చేసుకునే అవకాశం కల్పించారు. అయితే ఫీజులు ఎక్కడ వసూలు చేయాలి. ఎలా వసూలు చేయాలి, ఎంత వసూలు చేయాలనే విషయంలో గ్రామపంచాయతీ స్పష్టమైన నిబంధనలు పేర్కొన్నప్పటికీ టెండర్‌ను దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ అడ్డగోలుగా రుసుముల నిర్ణయించి ఫీజులు లాగుతున్నారని అంటున్నారు. అంతేకాదు ఫీజులు వసూలు చేసుకునేందుకు కేవలం గోదావరి నదికి వెళ్లే వాహనాలతో పాటు, ఆలయానికి దర్శనం కోసం వచ్చే భక్తుల వాహనాలకు మాత్రమే ఫీజులు వసూలు చేయాల్సి ఉన్నా ఆ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారీతిన వ్యవహరిస్తూ కనిపించిన ప్రతి వాహనం నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని చెబుతున్నారు.

కాళేశ్వర క్షేత్రంలో వాహనా ల ప్రవేశం మొదలుకొని.. ఫీజు వసూళ్ల వరకు నిబంధనలు పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నా అటు పంచాయతీ అధికారులు కానీ, ఇటు పోలీసులు కానీ చూసీ చూడనట్లుగా వ్యవహరించడం అనేక ఆరోపణలకు దారితీస్తోంది. అయితే సదరు కాంట్రాక్టర్ ఇచ్చే మామూళ్లకు కక్కుర్తి పడి వాహనదారులను నిలువు దోపిడీ చేస్తున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దాంతో పెట్రేగిపోతున్న కాంట్రాక్టర్ మనుషులు రాత్రి వేళల్లో కాళేశ్వరానికి దారితీసే ప్రధాన కూడళ్లలో తిష్టవేసి అటు ప్రైవేటు వాహనాలతో పాటు, స్థానికంగా ఉండే వాహన చోదకుల నుంచి కూడా ముక్కు పిండి నిర్దేశిత రుసుం కన్నా అదనపు మొత్తంలో ఫీజులు గుంజుతున్నారని అంటున్నారు. అదీకాకుండా జాతీయ రహదారిపై వెళ్లే వాహనాల నుంచి, టీజీఎండీసి ఇసుక రీచుల నుంచి వెళ్లే ఇసుక లారీల నుండి కూడా శవీ.ఉల పేరుతో డబ్బులు గుంజుతున్నారని అంటున్నారు. వాస్తవానికి ఇసుక లారీల నుండి ఎలాంటి ఫీజులు వసూలు చేయరాదని పంచాయతీ టెండర్ నిబంధనల్లో స్పష్టం చేసినా రాత్రిళ్లు జాతీయ రహదారిపై కర్రలతో తిష్టవేసి బలవంతంగా వాహనాలను ఆపి ఒక్కో లారీ నుండి 200 రూపాయల చొప్పున ఫీజులు

(మిగతా 8వ పేజీలో)

చేనేత వస్త్రాల ఆదరణకు కృషి

- మండల పర్యటనలో కలెక్టర్ రాహుల్ శర్మ
- ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఆకస్మిక పరిశీలన
- కాళేశ్వరంలో ముక్తివనం, ఆశ్రమ పాఠశాల సందర్శన



టస్సర్ ద్వారా తయారు చేసిన దారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చేనేత వస్త్రాలకు విశ్వవ్యాప్తంగా ఆదరణ కల్పించేందుకు కృషిచేస్తానని జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మండలంలో బుధవారం ఆకస్మిక పర్యటన చేసిన కలెక్టర్ చేనేత మగ్గాలు, చీరల తయారీ విధానాన్ని పరిశీలించారు. టస్సర్ రైతులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో పర్మనెంట్ స్టాళ్లతో పాటు కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఒక స్టాల్ ఏర్పాటు చేసుకుని విక్రయించాలని సూచించారు. ఆఫ్‌లైన్ మార్కెటింగ్ మాత్రమే కాకుండా ఆన్‌లైన్‌లోనూ చేనేత వస్త్రాలను విక్రయించేందుకు సైట్ ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తానని అన్నారు. టస్సర్‌కాయల సేకరించే విధానం, రైతుల సమస్యలపై సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం టస్సర్‌కాలనీలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను ఆకస్మికంగా పరిశీలించారు. మొబైల్ యాప్‌లో లబ్ధిదారుల వివరాలు నమోదు ప్రక్రియలో క్షేత్రస్థాయి సమస్యలపై ఆరాతీశారు. రోజుకు ఎన్ని కుటుంబాలు సర్వే చేస్తున్నారు, సర్వేలో కుటుంబ సభ్యుల వివరాల నమోదు వంటి అంశాలపై ఆరాతీసి పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలో 2500 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉందని కార్యదర్శి వివరించారు. ఐకేపీ ఇందిరమ్మ మహిళ శక్తి ద్వారా ఏర్పాటైన లడ్డూ, ఖారా తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. తయారీ విధానం, ఆదాయ వివరాలను లబ్ధిదారుడిని అడిగి తెలుసుకున్నారు. కాళేశ్వరంలోని ముక్తివనాన్ని జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ కుమార్‌తో కలిసి సందర్శిం చారు. వనంలో వసతులు, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఆశ్రమ గురుకుల పాఠశాలను పరిశీలించారు. వంట గది, ఆర్‌ఓ ప్లాంట్, కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. 8, 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి ఇంగ్లీష్, హిందీ పాఠాలను చదివించి అభినందించారు. స్టీమ్ ద్వారా వంటచేయు పరికరాలకు మరమ్మత్తులు చేయించి వినియోగంలోకి తేవాలని సూచించారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి వీరభద్రయ్య, డిప్యూటీ తహశీల్దార్ కృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ బాలకృష్ణ తదితరులున్నారు.



కుమ్మరి కులస్థులతో హస్తకళల శాఖ అధికారులు

హస్తకళాకారులకు మెరుగైన శిక్షణ అందిస్తాం

హస్తకళ శాఖ అసిస్టెంట్ సెంట్రల్ డైరెక్టర్ దివ్యరావు

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : హస్తకళల శాఖ ద్వారా కుమ్మరి కులస్తులకు మెరుగైన శిక్షణ అందించి కులవృత్తిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేస్తామని హస్తకళ శాఖ అసిస్టెంట్ సెంట్రల్ డైరెక్టర్ దివ్యరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో డిజైనర్ రాజేష్‌తో కలిసి ఐదు మండలాల కుమ్మరి కులస్తులకు హస్తకళల్లో రాణించడంపై అవగాహన కల్పించారు. గుజరాత్ వంటి రాష్ట్రాల్లో వివిధ డిజైన్లలో తయారు చేసే మట్టిపాత్రల తయారిపై ట్రెయినర్‌తో శిక్షణ ఇప్పిస్తామన్నారు. కులవృత్తుదారులందరికి సెంట్రల్ ఐడీ కార్డులు జారీ చేసేందుకు కృషి చేస్తామన్నారు. దీనికి ముందు టస్సర్‌కాలనీలోని పట్టువస్త్రాల తయారీ పరిశీలించి ఈ రంగంలో రాణించేందుకు పలు సూచనలు చేశారు.

కార్యక్రమంలో కుమ్మరి సంగం నాయకులు సముద్రాల తిరుపతి, పోతుగంటి సమ్మయ్య, దుబ్బాసి సమ్మయ్య, దారిపెల్లి మల్లయ్య, రమేష్, చేతరాశి ప్రసాద్, ఆశాడపు దేవేందర్, కుమ్మరి కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల బస్తాలో దొడ్డు బియ్యం!

చిట్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతు కొనుగోలు చేసిన ఎరువుల బస్తాలో దొడ్డుబియ్యం వచ్చిన సంఘటన చిట్యాల మండలంలోని వరికోల్‌పల్లిలో బుధవారం చోటు చేసుకుంది. బాధిత రైతు ఆకునూరి ప్రభాకర్, రైతులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని గ్రోమోర్ కేంద్రంలో ఇటీవల ఎరువుల బస్తాలు కొనుగోలు చేశారు. కాగా పంట చేనుకు వేసేందుకు ఎరువుల బస్తాలను ఓపెన్ చేయగా దొడ్డు బియ్యం కనిపించడంతో విస్మయానికి గురయ్యారు. ఒక్కో బస్తా 50 కేజీలకు గాను రూ.1460 చెల్లించి కొనుగోలు చేస్తే దొడ్డుబియ్యం రావడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రోమోరు యాజమానిని రైతులు నిలదీయగా కంపెనీ యాజమాన్యంతో మాట్లాడుతున్నామని, వీటికి బదులు వేరే బస్తాలు ఇప్పించనున్నట్లు తెలిపారు.



డీఎంహెచ్‌వోలు గోపాల్‌రావు, అప్పయ్యను సన్మానిస్తున్న వైద్యాధికారులు

డీఎంహెచ్‌వో అప్పయ్యకు ఘన వీడ్కోలు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ములుగులోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో బదిలీపై వెళ్లిన డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్యకు బుధవారం ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రస్తుత డీఎంహెచ్‌వో గోపాల్‌రావు మాట్లాడుతూ ములుగు జిల్లాలో ఒక సాధారణ గిరిజనబిడ్డగా జన్మించి ఉన్నత చదువులు చదివి ములుగు జిల్లాకు డీఎంహెచ్‌వోగా డాక్టర్ అప్పయ్య ఎనిమిదేళ్లు పనిచేయడం గొప్పవిషయమని, అంతేకాకుండా మారుమూల గ్రామాలను వాగులు, వంకలు దాటి అడవిలో నివసిస్తున్న గిరిజనులు, గొత్తికోయలకు వైద్యసేవలు అందించి ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, రాష్ట్రమంత్రి, గవర్నర్‌చే అభినందనలు అందుకుని ఆదర్శవంతుడిగా ఎదిగారని కొనియాడారు. అప్పయ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లాలోని వైద్యాధికారులు, సిబ్బంది డీఎంహెచ్‌వోలు అప్పయ్య, గోపాల్‌రావులను పూలమాలలు, శాలువా లతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ములుగు ఏరియా వైద్యశాల సూపరిం టెండెంట్ జగదీశ్వర్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ పవన్‌కుమార్, డాక్టర్ చంద్రకాంత్, ఇన్‌చార్జి డెమో సంపత్, ఏఎంవో దుర్గారావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సంపత్‌రావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఆర్బీఎస్కే టీం డాక్టర్లు, మల్టీలెవల్ హెల్త్ ప్రొవైడర్లు, సిబ్బంది గణేష్, కిరణ్, సతీష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు జియో ట్యాగింగ్ చేస్తాం..

దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రాయల సునీత



ఆంధ్రజ్యోతి: దేవాలయాలకు జియో ట్యాగింగ్ అంటే?

కమిషనర్: జియో ట్యాగింగ్ అంటే కాకతీయ రాజులు నిర్మించిన దేవా లయాలు.. వాటి చరిత్ర, విశిష్టతను గూగుల్ మ్యాప్‌లో అప్‌లోడ్ చేయడం.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ భూములను గుర్తిస్తున్నారా?

కమిషనర్: ఉమ్మడి జిల్లాలో దేవాలయాల భూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే పరకాల డివిజన్‌పైలెట్ ప్రాజెక్టుగా 250ఎకరాలకు హద్దులు పెట్టాం.

ఆంధ్రజ్యోతి: కోర్టు కేసుల్లో ఎన్ని ఎకరాలున్నాయి?

కమిషనర్: వంద ఎకరాలు కోర్టు పరిధిలో ఉన్నాయి. ఎప్పటికైనా ఆ భూములు దేవాలయాలకే చెందుతాయి.

ఆంధ్రజ్యోతి: రాయపర్తి మండలం సన్నూర్ దేవాలయానికి చెందిన 899ఎకరాల కౌలు వస్తోందా?

కమిషనర్: రావడం లేదు. దీంతో దేవాలయంలో ధూప, దీప, నైవేద్యానికి సైతం కష్టతరంగా మారింది. దీనిపై కలెక్టర్ సమక్షంలో రైతులతో సమావేశం నిర్వహించాం. మళ్లీ సమావేశం ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: మేడారం మినీ జాతరకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయా ?

కమిషనర్: ఫిబ్రవరిలో జాతర ఉన్నందున అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం.

ఆంధ్రజ్యోతి: కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు ఎప్పుడు ?

కమిషనర్: 2025 మేలో కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలుంటాయి. ఇప్పటికే దేవాదాయ శాఖ మంత్రి ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. పుష్కరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: ప్రసాదానికి ఏ నెయ్యి వాడుతున్నారు ?

కమిషనర్: అన్ని దేవాలయాల్లో ప్రసాదాలకు విజయ డెయిరీ నెయ్యిని వాడుతున్నాం. ఈ విషయంలో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఆంధ్రజ్యోతి: మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా ?

కమిషనర్: ఉమ్మడి జిల్లాలో ఈవో స్థాయి అధికారులు 25 మంది అవసరం కాగా, ప్రస్తుతం 16 మందే ఉన్నారు. కింది స్థాయి సిబ్బంది కొరత కూడా ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

- వరంగల్ కల్చరల్, ఆంధ్రజ్యోతి

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

టీపీజేఏసీ రాష్ట్ర కో కన్వీనర్ మైస శ్రీనివాస్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గత ఇరవై ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) రాష్ట్ర కో-కన్వీనర్ మైస శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల విద్యావనరుల కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి హైమా ఈనెల 17న గుండెపోటుతో మృతి చెందగా, ఆమె ఆత్మకుశాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సమ్మె శిబిరం నుంచి ర్యాలీగా వెళ్లి గాంధీసెంటర్, నెహ్రూసెంటర్‌లో మానవహారం చేపట్టారు, అక్కడి నుంచి అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని విగ్రహం ఎదుట మోకాళ్లపై కూర్చుని భిక్షాటన చేపట్టారు. ఉద్యోగుల సమ్మెకు మైస శ్రీనివాస్ సంఘీభావం ప్రకటించి, మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉద్యోగుల వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఇరవై సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో జీవితాన్ని గడుపుతున్నారని, ఇప్పటికైనా ప్రజాప్రభుత్వం వీరి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్తున్న చిరుద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమ్మె చేస్తున్న ఉద్యోగులకు గార్ల మండల ఉపాధ్యాయుల సహకారంతో భోజన సదుపాయం కల్పించారు. ఈ సమ్మెకు తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం బాధ్యులు సంఘీభావం ప్రకటించారు. మహిళా ఉపాధ్యాయులు చంటి పిల్లలతో సమ్మెలో పాల్గొనగా ఒక చిన్నారి డప్పులు కొట్టడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. సమ్మెలో వీరన్న, భాస్కర్, మంజుల, ఉదయ్, బాబుబాల్, రవీందర్, నవీన్, విజయలక్ష్మీ, ఉమ, సరస్వతి, భవాని, గణేష్, సాగర్, ఉప్పలయ్య, వీరన్న, వీరస్వామి, ప్రభావతి, బిందు, రాజశ్రీ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో మానవహారం నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు



భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

భూపాలపల్లి జిల్లాలో..

భూపాలపల్లి టౌన్ (ఆంధ్రజ్యోతి): బతుకమ్మలతో ఆడుకుంటూ వంటావార్పు చేసి సమగ్ర శిక్షా ఉద్యోగులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి సేవాలాల్ సేనా నాయకుడు, ఎంఈవో దేవానాయక్ మద్దతు పలికారు. తమ న్యాయమైన డిమాండ్లు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

ములుగు జిల్లాలో..

ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ జిల్లాకేంద్రంలో సమగ్రశిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. ముందుగా ఖమ్మం జిల్లాలో డేటా ఎంట్రీ ఆపరేటర్ హైమావతి మంగళవారం మృతిచెందినందున ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి సమ్మెకు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్, సీపీఎం ములుగు మండల కార్యదర్శి గఫూర్‌పాషా, పట్టణ అధ్యక్షుడు ఎమ్డీ.సద్దాంహుస్సేన్‌లు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ సమ్మెలో సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి పాడియా కుమార్, ఉపాధ్యక్షుడు ఎమ్డీ.ఫిరోజ్, మహిళా అధ్యక్షురాలు జీవనప్రియ, సభ్యులు సుజాత, రమేష్, స్వాతి, అనిత, ప్రవీణ్ పాల్గొన్నారు.

జనగామ జిల్లాలో..

జనగామ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు జిల్లా కలెక్టరేట్ ముందు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు బుధవారం 9వ రోజుకు చేరుకున్నాయి. గౌరవ ముఖ్యమంత్రి చాయ్ తాగే సమయంలో మా డిమాండ్ నెరవేరుస్తామన్న హామీని నెరవేర్చాలని కోరుతూ జనగామ జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు శిబిరం వద్ద టీస్టాల్ ఏర్పాటు చేసి ప్రజలందరికీ టీ పోస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు తాడూరి రమేష్, దయాకర్, రవీందర్‌రెడ్డి, శ్రీలత, రొయ్యల రాజు, గిరి, రాజ్‌కుమార్, బాకీ వెంకటేశ్వర్లు, శివకుమార్, నర్సింహులు, పుష్పలత, బుర్రయాకస్వామి, బాలాజీ, హరిప్రసాద్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



జనగామలో నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

చలికి తట్టుకోలేక..
తనువు చాలించిన మహిళ



తూర్పాటి బుచ్చమ్మ మృతదేహం

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చలి తీవ్రత తట్టుకోలేక ఓ మతి స్థిమితం లేని ఓ మహిళ తనువు చాలించింది. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం జరిగింది. కాటారం మండలంలోని పాతరుద్రారం గ్రామానికి చెందిన తూర్పాటి బుచ్చమ్మ (58)కు గత కొంతకాలం నుంచి మతిస్థిమితం సరిగ్గా ఉండటంలేదు. ఈ క్రమంలో భూపాలపల్లి పట్టణంలో ఒంటరిగా తిరుగుతూ స్థానికులు ఇచ్చే ఆహారం తింటూ పట్టణంలోని బస్టాండ్ పక్కన నిర్మాణం చేపట్టిన పండ్ల దుకాణ సముదాయంలో తలదాచుకుంటోంది. ఈ క్రమంలో నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో ఆరు బయట తలదాచుకుంటున్న ఆ మహిళా పండ్ల దుకాణ సముదాయం పక్కన స్పృహలేకుండా పడిఉండటాన్ని బుధవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.

పోలీసులు అక్కడకు చేరుకొని ఆమె వివరాలను తెలుసుకొని కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతురాలి భర్త శంకర్ కొన్నేళ్ల కిందటే మృతి చెందగా.. సిరొంచ మండలంలోని రంగయ్యపల్లిలో నివాసముండే ఆమె కుమార్తె టేకం రాధిక, అల్లుడు రాజబాపులు వచ్చి ఆమె మృతదేహాన్ని స్వగ్రామమైన పాతరుద్రారానికి తీసుకెళ్లినట్టు పోలీసులు తెలిపారు.

గార్ల ఎస్సైగా రియాజ్ పాషా బాధ్యతల స్వీకరణ



గార్ల డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గార్ల ఎస్సైగా రియాజ్ పాషా బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా ఏడాది పాటు పనిచేసిన జీనత్‌కుమార్ జిల్లా కేంద్రంలో ఎస్పీ ఆఫీస్‌కు బదిలీకాగా, మహబూబాబద్‌లో పని చేసిన రియాజ్ పాషా ఇక్కడి వచ్చారు. ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలి

- పక్కా సమాచారం సేకరించి, నివేదిక సిద్ధం చేయాలి
- మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



బొద్దుగొండలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

గూడూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వేను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. బొద్దుగొండ, అయోధ్యపురంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వేను బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన ప్రకారమే సిబ్బంది సర్వే నిర్వహించాలన్నారు. పక్కా సమాచారం సేకరించి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా వేగంగా సర్వే జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారుల వివరాలు సేకరించి ఇందిరమ్మ కమిటీ సభ్యులను భాగస్వాములను చేస్తూ నిబంధనల ప్రకారం.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇళ్లను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం దామెరవంచ జీసీసీ, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అయోధ్యపురం, దామెరవంచ, గూడూరు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆశ్రమ హైస్కూల్, గిరిజన బాలుర గురుకులంలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భోజన మెనూను ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని ఆదేశించారు. వసతి గృహాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీరస్వామి, తహసీల్దార్ శ్వేత, కార్యదర్శి శేఖర్, ఏవో అబ్దుల్ మాలిక్, ఆర్ఐ మల్లయ్య పాల్గొన్నారు.



బాబుకు బ్యాడ్జ్ తొడుగుతున్న సీపీ అంబర్ కిశోర్‌ఝా

సీపీకి కృతజ్ఞతలు తెలిపిన పీసీ

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఘన్‌పూర్ ఏసీపీ కార్యాలయంలో కొన్ని ఏళ్లుగా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లెపాక బాబు ఇటీవల పదోన్నతి పొందారు. బాబు బుధవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్‌ఝాను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పదోన్నతి కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ బాబుకు హెడ్‌కానిస్టేబుల్ పదోన్నతి బ్యాడ్జ్‌ను తొడిగి అభినందించారు.

పదే పదే డయల్ 100కు ఫోన్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు



నిందితుడు భాస్కర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

డోర్నకల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి పదేపదే డయల్ 100కు ఫోన్‌చేసి, పోలీస్‌ల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేష్‌నాయక్ తెలిపారు. బుధవారం సీఐ తెలిపిన వివరాల ప్రకారం. తెల్లబండతండాకు చెందిన గుగులోతు భాస్కర్ అనేవ్యక్తి మద్యం సేవించి డయల్ 100కు పదేపదే ఫోన్‌చేస్తూ ఏమి మాట్లాడకుండా ఉంటున్నాడని చెప్పారు. దీంతో పోలీసుల విధులకు ఆటంకం కలిగించి వారి సమయాన్ని వృథా చేసినందుకు గాను అతడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అత్యవసర సమయాల్లో మాత్రమే ప్రజలు డయల్ 100కు ఫోన్ చేయాలని చెప్పారు. పోలీసుల సమయాన్ని వృథా చేయొద్దన్నారు.

మినీ జాతర పనులు ప్రారంభం

మేడారం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క, సారలమ్మల మినీజాతరకు తరలి వచ్చే భక్తుల సౌకర్యాల పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. 2025 ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు మేడారంలో జరగబోయే మినీజాతర (మండె మెలుగు) పండుగకు తరలి వచ్చే భక్తుల సౌకర్యాలలో భాగంగా క్యూలైన్లలో గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ముందస్తుగా తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేపట్టినట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి రాజేంద్రం తెలిపారు. ఈ క్రమంలో పారిశుధ్య పనులను జిల్లా పంచాయితీరాజ్ అధికారి దేవరాజ్ పరిశీలించారు. వస్తున్న భక్తులకు గద్దెల పరిసరాల్లోని మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలని కార్యదర్శి సతీష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



క్యూలో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

ఆదర్శనీయుడు.. అంబేద్కర్

- చల్లగరిగలో అంబేద్కర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- అంబేద్కర్ విజ్ఞాన మందిరం ఏర్పాటు చేయాలి : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

చిట్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆదర్శనీయుడని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని చల్లగరిగలో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే సత్యనారాయణరావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్, ప్రొఫెసర్ కంచ ఐలయ్య బుధవారం హాజరయ్యారు. ముఖ్య అతిథులకు డప్పుచప్పుళ్లు, బంతి పూలు, కోలాటాలతో మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేయడం అదృష్టంగా బావిస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కుతో పాటు రాజకీయ, ఉద్యోగ అవకాశాలు కల్పించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అన్నారు. యువత అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విగ్రహ ఏర్పాటుతోనే పండుగ కాదు, విశ్వమేధావి కోట్లాది మంది ప్రజల జీవితాలను తన మేథో సంపత్తితో సమూలంగా మార్చిన మహనీయుడిని సత్కరించడం అభినందనీయమన్నారు.

ఆయన ఆలోచనలను నివృత్తి చేసుకుని అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి. అంబేద్కర్ జీవిత చరిత్రను ప్రతీ కుటుంబంలో చర్చించాలి అప్పుడే మార్పు వస్తుందన్నారు. అంబేద్కర్ విజ్ఞాన మందిరం ఏర్పాటు చేయాలన్నారు. చదువుతోనే కుటుంబాల ఆర్థిక వ్యవస్థలు మెరుగవుతాయని తెలిపారు. ఆగర్భ శ్రీమంతులు, ఉన్నత కుటుంబాల పిల్లలకు సీట్లు వచ్చే ఢిల్లీ యూనివర్సిటీలో మండలంలోని బావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన గిరిజన బాలికలకు సీట్లు వచ్చాయి.. అదీ చదువు, ప్రతిభకు ఉన్న కొలమానమన్నారు.

ప్రొఫెసర్ కంచ ఐలయ్య మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నతంగా బతకాలన్నారు. అంటరానితనాన్ని పారద్రోలాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పసునూరి రవీందర్, కొల్లూరి భరత్, నలిగంటి శరత్, సినీగేయ రచయిత మిట్టపల్లి సురేందర్, బోడ డిన్న, రాజు నాయక్, సందీప్, కన్నం సునీల్, అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్, చిత్రంలో కంచె ఐలయ్య, ఎమ్మెల్యే జీఎస్సార్

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

తాడ్వాయి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ములుగులో జిల్లాస్థాయి సీఎంకప్ పోటీలు జరగగా మండల విద్యార్థులు సీనియర్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో తుల రవి, అథ్లెటిక్స్ ఇన్‌చార్జి ఆదినారాయణలు వారికి గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీ బలుగూరి వేణు, పీఈటీల సంఘం అధ్యక్షుడు గుండెబోయిన మల్లయ్య, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల నుంచి శబరిమలకు ప్రత్యేక బస్సు



శబరిమలకు వెళ్తున్న బస్సును ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ స్వాతి

జనగామ రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేవరుప్పుల నుంచి శబరిమలకు వెళ్తున్న స్పెషల్ బస్సు సూపర్ లగ్జరీ బస్సుకు బుధవారం జనగామ డిపోలో మేనేజర్ ఎస్.స్వాతి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ బుధవారం ప్రారంభమైన బస్సు దేవరుప్పుల నుంచి శ్రీశైలం, మహానంది, కాణిపాకం, గురువాయర్ మీదిగా పంబా శబరిమలైకు చేరుకుంటుందని తెలిపారు. దైవ దర్శనం అనంతరం శ్రీరంగం, అరుణాచలం, కంచి, తురుత్తని, శ్రీకాళహస్తి, తిరుపతి, విజయవాడ ద్వారా చేరుకోని ఈనెల 24న దేవురుప్పుల చేరుకుంటుదని తెలిపారు. అయ్యప్ప స్వాములకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా శబరిమలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్లతో అదనపు ఆదాయం పొందాలి

వాజేడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి, పెద్దగొల్లగుడెంలలో ఉన్న 95 మంది లబ్ధిదారులకు పెరటికోళ్లను బుధవారం పంపిణీ చేశారు. పీవీ నరసింహరావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం-పశు పరిశోధన క్షేత్రం మామునూరు ఆధ్వర్యంలో షెడ్యూల్ తెగల ఉప ప్రణాళికలో భాగంగా రెండు గ్రామాలకు చెందిన పెరటి కోళ్లతో పాటు, కోళ్ల పెంపకానికి అవసరమయ్యే దాణా, నీటితొట్టెలను అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆఫీసర్ ఇన్‌చార్జి హెడ్ డాక్టర్ అమరేశ్వరి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికా రి డాక్టర్ కొమురయ్య, పశువైద్యాధికారి డాక్టర్ నరసింహులు, డాక్టరు శ్రీనిధి, అసిస్టెంట్ కుమారస్వామి, ఖాజాఖాన్‌లు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

పెద్దవంగర, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమవంతు సహాయ సహకారాలు అందించే తత్వాన్ని అలవర్చుకోవాలని ఎంఈవో బుదారపు శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్ఎం ఆర్రోజు విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఆర్సీ తండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు చిక్కాల సతీష్ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు క్రీడా సామగ్రి, వృద్ధులకు దుప్పట్లను అందజేశారు.

ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులను గౌరవించడంతో పాటు వారిని ఆదరించాల్సిన బాధ్యత సమాజంలోని అందరిపై ఉందన్నారు. బడుగు బలహీన వర్గాలకు ప్రజలకు, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్న చిక్కాల సతీష్‌ను అభినందించారు.

సీఐ కార్యాలయం తనిఖీ

పాలకుర్తి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. డీసీపీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులు ఫిర్యాదు చేస్తే స్పందించాలని, వారికి సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలోని యువత మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. విధులకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలుంటాయని అన్నారు. ఆయన వెంట ఏసీపీ నర్సయ్య, సీఐ మహేందర్‌రెడ్డి ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ, చిత్రంలో ఏసీపీ నర్సయ్య

అలసట తెలియని సేవకుడు

- నాలుగు దశాబ్దాలుగా నిరుపేదలకు చేయూత
- గుడుంబా, బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్న రిటైర్డ్ టీచర్
- వేతనం, పెన్షన్‌లో సగం సేవలకే ఖర్చు చేస్తున్న గుగులోతు కిషన్

స్ఫూర్తి



అనంతారంలో గుడుంబా నివారణ ర్యాలీలో కిషన్‌నాయక్ (ఫైల్)


ఒడిశా మాజీ సీఎం గిరిధర్ గొమాంగో నుంచి ఉత్తమ సామాజిక సేవ అవార్డు అందుకుంటున్న కిషన్‌నాయక్ (ఫైల్)

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆయన ఓ రిటైర్డ్ టీచర్. మారుమూల తండాలో జన్మించి.. ఉన్నత చదువులు చదివి ఉపాధ్యాయుడిగా పనిచేశారు. చిన్ననాటి నుంచే తండ్రి నుంచి సేవా వారసత్వాన్ని అందుకున్న ఆయన చదువుకోవడం, విద్యాబోధనే కాకుండా సామాజిక సేవా గుణాన్ని అలవర్చుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా అలసటనేది లేకుండా సామాజిక సేవను కొనసాగిస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు గుగులోతు కిషన్‌నాయక్. ఉపాధ్యాయుడి పని చేసినప్పుడు వేతనం.. పదవీవిరమణ పొందాక వస్తున్న పెన్షన్‌లో సగభాగం సేవా కార్యక్రమాలకే ఖర్చు చేస్తున్నారు. తనకు తోచిన మేరకు నిరుపేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలు, పరీక్ష సామగ్రి, దుస్తులను అందిస్తున్నారు. మహబూబాబాద్ పట్టణ శివారు బాబునాయక్ తండాకు చెందిన హతిరాంనాయక్, కైకబాయి పెద్ద కుమారుడైన గుగులోతు కిషన్‌నాయక్ చిన్నతనం నుంచే తన తండ్రి హతిరాం నుంచి సేవా గుణాన్ని అలవర్చుకున్నారు. విద్యార్థి దశనుంచే వామపక్ష భావజాల సంఘాల్లో పనిచేసిన ఆయన సమాజంలో జరిగే అనేక అన్యాయాలపై జరిగిన పోరాటాల్లో పాలుపంచుకున్నారు. దోపిడీ లేని సమాజ నిర్మాణం కోసం పని చేసిన ఆయన 1989 సెప్టెంబరు 6న ఉపాధ్యాయ వృత్తిలో చేరారు.


విద్యార్థులకు ఆల్ ఇన్‌వన్ గైడ్, మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను అందజేస్తున్న కిషన్‌నాయక్ (ఫైల్)

గుడుంబా, బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సులు

నాలుగు దశాబ్దాలుగా కిషన్‌నాయక్ అనేక సేవా కార్యక్రమాల ను నిర్వహిస్తూ వస్తున్నారు. 1982 లో గిరిజన విద్యావంతుల సిండికేట్, 1990 సంవత్సరంలో గిరిజన సామాజిక చైతన్య వేదికను స్థాపించి మహబూబాబాద్ జిల్లాలోని తండాల్లో గుడుంబా నివారణ, బాల్యవివాహాల నిర్మూలనకు సదస్సులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించారు. అంతే కాకుండా పర్యావరణ పరిరక్షణ, ఎయిడ్స్ నిర్మూలన, విద్యాప్రాముఖ్యతపై దాదాపు 500వరకు సదస్సులు నిర్వహించారు. తండాలు, పల్లెల్లో బడి బయట ఉండే బడీడు పిల్లలు వారిని బడిలో చేర్పించారు. నిరుపేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలు, దుస్తులను పంపిణీ చేశారు. ఇప్పటికి వరకు సుమారుగా 6 వేల మంది విద్యార్థులకు తన వంతు సాయం అందించారు.

1990, 1999లో గిరిజనుల జీవన స్థితిగతులపై 450 గిరిజన తండాల్లో అధ్యయనం చేసి, నాటి ప్రభుత్వాలకు నివేదికలను అందించారు. ఎక్కడ ఉపాధ్యాయుడిగా పని చేస్తే ఆ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేసేవారు. 2022లో జిల్లాలోని పలు మండలాల్లో విద్యా అవగాహన సదస్సులు చేపట్టి విద్య ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు. దళిత కాలనీలు, గిరిజన తండాలు, ఆదివాసీ గూడాల్లో అంబేద్కర్, పూలే ఆలోచన విధానంపై చైతన్య సదస్సులను నిర్వహించి మహనీయుల గొప్పతనాన్ని చాటి చెప్పారు. తనకు వచ్చే వేతనంలో సగం సామాజిక సేవకే ఖర్చు చేసేవారు. దివ్యాంగులు, అనాథలకు దుస్తులు, దుప్పట్లు అందించి తనవంతు సాయమందించారు.

భావితరాలకు మహనీయుల జీవిత చరిత్రలు

దేశంలో దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటు పడ్డ మహనీయులు జీవిత చరిత్రలను భావి తరాలకు తెలియజేయాలనే సంకల్పంతో వారి జీవితచరిత్ర పుస్తకాలను అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు కిషన్‌నాయక్ పంపిణీ చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతిబాపూలే, సావిత్రి బాయి పూలే, పెరియర్, సాహుమహారాజ్, సేవాలాల్ మహారాజ్ లాంటి వారి చరిత్ర కనుమరుగు కావొద్దనే లక్ష్యంతో సొంతంగా పుస్తకాలు కొనుగోలు అందజేస్తుంటారు. ఆ మహనీయుల జయంతి, వర్ధంతుల రోజు సదస్సులను ఏర్పాటు చేస్తూ, వారు చేసిన సేవలను ప్రజలకు తెలియజేస్తున్నారు. ఈ ఏడాది జూన్ 30న ఉపాధ్యాయ వృత్తి నుంచి ఉద్యోగ విరమణ పొందిన ఆయన సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. అందుకోసం ప్రస్తుతం తనకు వస్తున్న పెన్షన్ నుంచి సగం కేటాయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

చలికాలంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది..



- రోగాలు చుట్టుముట్టే ప్రమాదం ఎక్కువ
- సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదించాలి
- ఎంజీఎం జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వైద్యం గౌతం

'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన

వరంగల్ మెడికల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చలికాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సహజంగానే వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుందని ఫలితంగా రోగాల బారిన పడాల్సి వస్తుందని వరంగల్ ఎంజీ ఎం జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వైద్యం గౌతం సూచిం చారు. చలికాలంలో వచ్చే వ్యాధులు, చికిత్స, తీసుకో వాల్సిన జాగ్రత్తలపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి అనేక మంది కాల్ చేయగా వారికి డాక్టర్ గౌతమ్ సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు.. పలు సందేహాలను నివృత్తి చేశారు.

● ప్రయాణంలో ముక్కు కారడం, తుమ్ములు వస్తుంటాయి?

భూక్య శ్రీనివాస్, నరసింహారావుపేట, మహబూబాబాద్ జిల్లా

డాక్టర్ : సాధారణంగా ప్రయాణం చేసే సమయంలో దుమ్ము ధూళి వల్ల ముక్కు కారడం జరుగుతుంది. ముక్కులో నుంచి రక్తం కారినట్లు అనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. లేదంటే ప్రయాణం చేసే సమయంలో మాస్క్ ధరించాలి. తరుచూ ముక్కును శుభ్రం చేసుకోవడం వల్ల ఈ సమస్యను అధిగమించవచ్చు.

● చర్మంపై దురతోపాటు జలుబు తగ్గడం లేదు?

సింగు లక్ష్మీనారాయణ, దామెరమెంట్ల, కాటారం మండలం, భూపాలపల్లి జిల్లా

డాక్టర్: జలుబు పూర్తిగా తగ్గకపోతే సైనసైటిస్‌గా అనుమానించవచ్చు. ఎక్స్‌రే, సిటీ స్కాన్ చేసి వ్యాధిని నిర్ధారించొచ్చు. చర్మంపై దురదను నివారణకు మాశ్చరైసర్ లేపనాలను వాడాలి.

● దగ్గు, గొంతు నొప్పితో పాటు కండరాల నొప్పి ఉంటుంది?

గోదాసి అశోక్ కుమార్, ధర్మారం, గీసుగొండ మండలం, వరంగల్ జిల్లా

డాక్టర్: చలికాలంలో సర్వసాధారణం. రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల సంభవిస్తుంది. గొంతు నొప్పికి వైద్యుడి సలహా మేరకు యాంటీబయాటిక్ వాడటం వల్ల అధిగమించవచ్చు. కండరాల నొప్పులు అన్ని కాలాల్లో ఉంటే వైద్యులను తప్పకుండా సంప్రదించాలి.

● నా భార్యకు శ్వాస ఇబ్బంది.. గొంతు, ముక్కు మూసుకపోయినట్లు అనిపిస్తుంది.

సప్పిడి రాము, ఏటూరునాగారం

డాక్టర్: చలి తీవ్రత పెరగడంతో సాధారణంగా ఇలాంటి లక్షణాలు పెరుగుతాయి. ఇలాంటి వాటిని అధిగమించడానికి హ్యూమెడిపయర్ కూడా అందుబాటులో ఉంది. లేదంటే సాధారణ కుక్కర్లు విజిల్స్ వచ్చే వరకు ఉంచి నిద్రించే గదిలో ఉంచడం వల్ల గాలిలో తేమ శాతం పెరుగుతుంది. వీటికితోడు చేతులకు, కాళ్లకు గ్లౌజులు, మంకీ క్యాప్ వాడాలి.

● గురుకులాలు, వివిధ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు చర్మ వ్యాధులతో పాటు వైరల్ ఫీవర్ వస్తున్నాయి?

నరేశ్, ఏటీఎస్ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు

డాక్టర్: చలికాలంలో సహజంగా ఇమ్యూనిటీ తగ్గడం వల్ల వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా హాస్టల్ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను తప్పకుండా పాటించాలి. కొబ్బరినూనె లాంటివి వాడటం వల్ల చర్మ వ్యాధులను అధిగమించవచ్చు. జ్వరాల తీవ్రత పెరిగితే తప్పకుండా వైద్యులను సంప్రదించాలి.

● కడుపు ఉబ్బరంగా ఉంటుంది. తేలికపాటి ఆహారం తీసుకున్నా జీర్ణమైనట్టు అనిపిస్తలేదు?

అడువాల రత్నాకర్, గోపాల్‌పూర్, హనుమకొండ

డాక్టర్: చలికాలంలో చాలా తక్కువ తేలికపాటి ఆహారం తీసుకోవడం ఉత్తమం. నాలుగు గోడల మధ్య శారీరక వ్యాయామం చేస్తే ఈ పరిస్థితిని అధిగమించవచ్చు. ఎప్పటికి ఇలాగే ఉంటే తప్పకుండా వైద్యులను సంప్రదించాలి.

● ఆకలి కావడం లేదు

తడూరి శ్రీదేవి, విజయగణపతి నగర్, హనుమకొండ

డాక్టర్: చలికాలంలో సహజంగా ఆకలి మందగిస్తుంది. శారీరక శ్రమ లేకపోవడం వల్ల ఆకలి అయినట్లు అనిపించదు. తేలికపాటి ఆహార పదార్థాలను తీసుకోవడం ఉత్తమం. వేడి పదార్థాలు మాత్రమే భుజించాలి. రాత్రి 7 గంటల్లోపు మాత్రమే తినాలి. మధ్యాహ్న భోజనం కూడా సాధ్యమైనంత త్వరగా చేయాలి. సమయపాలన పాటించడం వల్ల వీటన్నింటినీ అధిగమించవచ్చు.

● చలికాలంలో శ్వాస ఇబ్బంది తలెత్తుతుంది?

వీరమల్ల శ్యామ్, కరీమాబాద్, వరంగల్

డాక్టర్: చలికాలంలో శ్వాస ఇబ్బందులు తలెత్తడం సహజం. కానీ సైనోసైటిస్ సమస్య అయితే మాత్రం వైద్యులకు చూపించాలి. ముక్కుకు మాస్క్ పెట్టుకోవడం తప్పనిసరి.

పల్లెల్లో పట్నాల సందడి

మల్లన్నకు ఘనమైన మొక్కులు

ఆచారం


మల్లన్నకు నైవేద్యం సమర్పించే ప్రతిమలు


వెంకటాపూర్‌లో మల్లన్న పెళ్లికి వేసిన పట్నం

గ్రామగ్రామాన మల్లన్న పట్నాల సందడి కనిపిస్తోంది. ప్రతీ ఏడాది డిసెంబరు, జనవరి మాసాల్లో కొమురవెల్లి మల్లన్న పండుగ ప్రారంభమవుతుంది. ఈ క్రమంలో బుధవారం పలు గ్రామాల్లో మల్లన్న పట్నాలు(చిన్నపట్నం, పెద్ద పట్నం) వేస్తూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నపట్నం ఒక్కరోజే ముగుస్తుందని, పెద్ద పట్నమైతే ఐదురోజులు నిర్వహిస్తామని యాదవ రాజులు చెబుతున్నారు. పెద్దపట్నం వేసుకునేవారి ఇళ్లలో మల్లన్న దేవుడి పెళ్లిసందడి కనిస్తుంది. పుట్ట బంగారం తీసుకురావడంతో మల్లన్న పట్నాల సందడి మొదలవుతుంది. ఒడువాల బియ్యంతో పోలుపోసిన తర్వాత పైలలు తీసే కార్యక్రమం జరుగుతుంది. ఆతర్వాత మల్లన్నకు అభిషేకం, స్నానం చేయించి పోలుమీదికి తీసుకురావడంతో కార్యక్రమం ముగుస్తుంది. మరుసటిరోజు ఉదయం పసుపు,కుంకుమ, ఒడిబియ్యంతో మల్లన్న పట్నాల చుట్టూ తిరుగుతూ నాగవెల్లి కార్యక్రమం నిర్వహించి మల్లన్న పట్నాలను ముగిస్తారు. గజ్జెల్లాగులతో పోలుతొక్కించి శివసత్తుల ఊరేగింపుతో గ్రామాల్లో సందడి ఉంటుంది.

- వెంకటాపూర్, ఆంధ్రజ్యోతి

పచ్చని చిలుకలు తోడుంటే..

క్లిక్ క్లిక్



పంటలు.. పశుపక్షాదుల ప్రకృతి అనుబంధం అంతాఇంతా కాదు. సూర్యోదయమైనా.. సూర్యాస్తమయ సమయమైనా పక్షుల కిలకిలారావాలతో పల్లెలు పరవశిస్తాయి. పొలాల్లో సంచరించే పిచ్చులు, కొంగలు తదితర పక్షులు కనువిందు చేస్తుంటాయి. వాటిలో రామచిలుకలదైతే ప్రత్యేక స్థానం. వాటి పెంపుడు పక్షిగానే కాకుండా సాక్షాత్తూ ఆ సీతారామచంద్రస్వామి స్వరూపంగా భావిస్తారు. అలాంటి రామచిలుకల సమూహం ఇదిగో ఇలా రైతుకు తాము తోడున్నామన్నట్టుగా.. ఓ కల్లం వద్ద రాసిగా పోసిన ధాన్యంపై వాలి సందడిచేశాయి. అంతేకాదు ఆ వడ్లను బుక్కుతూ కనిపించాయి. ఈ సందర్భంలో ఆరుగాలం శ్రమించిన ఆ రైతు కూడా వాటిని చూసి మురిసిపోతూ తాను పడిన కష్టాన్ని మరిచిపోయాడు. వరంగల్ జిల్లా ఎలుకుర్తిలో బుధవారం కనిపించిందీ దృశ్యం.



ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

వడ్డెపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లి శివారులోని చెరువుకట్ట శివాలయం వద్ద గల ఉమారామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గురుస్వాములు శ్రీకాంత్, హరిమహేందర్, ఆకుల మధు ఆధ్వర్యంలో పురోహితుడు ప్రవీణ్‌శర్మ పర్యవేక్షణలో అయ్యప్పస్వామి పడిపూజను బుధవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, మాజీ కార్పొరేటర్ విజయ్ భాస్కర్, కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ తదితరులతో పాటు అయ్యప్ప భక్తులు అనుమాల శ్రీకాంత్, బోయినపల్లి సాయి తదితరులు స్వామిని భక్తి ప్రపత్తులతో కొలిచారు.


పడిపూజలో పాల్గొన్న స్వాములు

ఖండాంతరాలు దాటిన ప్రేమ

ఇటలీ అమ్మాయితో వరంగల్ అబ్బాయికి పెళ్లి


దేశాయిపేటలో వివాహం చేసుకున్న జంట

పోచమ్మమైదాన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వారు ప్రేమకు ఎల్లలు లేవని నిరూపించారు. ఖండాంతరాలు దాటిన ప్రేమకు మూడుముళ్లు వేసి ఒక్కటయ్యారు. వరంగల్ దేశాయిపేట ఒయాసిస్ కాలనీకి చెందిన కొడిపాక సదానందం - ప్రసన్నరాణి దంపతుల కుమారుడు సూర్యప్రీతం కొన్నేళ్ల కిందట ఉన్నత విద్యకోసం లండన్ వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. ఈ క్రమంలో అక్కడ ఇటలీ దేశానికి చెందిన జెన్నిపేటలోని - మోనికపేటలోని దంపతుల కుమార్తె మార్తపేటలోనితో ప్రేమలో పడ్డాడు. ఇద్దరు కలిసి ఇరు కుటుంబాల పెద్దలను ఒప్పించారు. బుధవారం దేశాయిపేటలోని సీఎస్‌ఐ చర్చిలో కుటుంబ సభ్యుల సమక్షంలో వైభవంగా వివాహం చేసుకున్నారు.

రైల్వే బోర్డుపై ఉండే.. 'ఎంఎస్ఎల్+' అంటే..!

మీకు తెలుసా?


ప్రతీ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంకు రెండు చివరలా ఊరును తెలిపే బోర్డులు ఉంటాయి. వాటిపై 'ఎంఎస్ఎల్+' అనే అక్షరాలతో పాటు ఒక నెంబరు రాసి ఉంటుంది. అసలు ఈ ఎంఎస్ఎల్+ అంటే ఏంటనే విషయాన్ని ఎవరూ పట్టించుకోరు. అయితే 'మీన్ సీ లెవల్(సగటు సముద్ర మట్టం) పదాలకు సంక్షిప్త రూపమే ఎంఎస్ఎల్. ఇక '+' అనేది సముద్ర మట్టానికి ఎత్తులో ఉన్నదని సూచిస్తుంది. సదరు రైల్వే స్టేషన్ సముద్ర మట్టానికి ఎంతఎత్తులో ఉందనేది మీటర్లలో చూపుతుంది. ఉదాహరణకు కేసముద్రం రైల్వేస్టేషన్ బోర్డుపై 'ఎంఎస్ఎల్+218.34ఎం' అని ఉంటుంది. అంటే ఈ రైల్వేస్టేషన్ సముద్రమట్టానికి 218.34 మీటర్ల ఎత్తులో ఉందన్న మాట. రైల్వే సిబ్బందికి సాంకేతికంగా రైలు నడపడంలో ఈ సమాచారం ఉపయోగపడుతుంది. అంతేకాకుండా ప్రయాణికులకు ఈ సంఖ్య భౌగోళిక అవగాహనను కల్పిస్తుంది. సముద్రతీర ప్రాంతాల్లో ఉన్న రైల్వేస్టేషన్ల వద్ద బోర్డులపై +5, +10మీటర్లే ఉంటుంది. తుఫానులు, వరదలు వచ్చిన సమయంలో ఆయా ప్రాంతాల్లో ఈ సమాచారం ఎంతో కీలకంగా మారుతుంది.



- కేసముద్రం, ఆంధ్రజ్యోతి

రహస్యాల భద్రకాళి

- చెరువు కేంద్రంగా ఎన్నో రహస్యాలు
- డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి వెల్లడి


సిద్ధులగుట్టపై నాటి అడుగుల ఆనవాళ్లను చూపిస్తున్న చరిత్రకారుడు రత్నాకర్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి చెరువు నీటిని ఖాళీ చేయడంతో పరిశోధకుల దృష్టి భద్రకాళి చెరువుతో పాటు చెరువు చుట్టు అల్లుకుని ఉన్న గుట్టలపై పడింది. ఈ నేపథ్యంలో చారిత్రాత్మక భద్రకాళి చెరువు కేంద్రంగా ఎన్నో రహస్యాలు దాగి ఉన్నాయని, నగర ప్రజలు గతంలో ఎన్నడూ ఎరుగని అద్భుతాలు చూస్తారని డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. రత్నాకర్‌రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా ఆసక్తికర విషయాలను బుధవారం వెల్లడించారు.

● వేలాది ఏళ్లుగా ఆదిమానవులు, రాజవంశీయులు, ఆధ్యాత్మికపరులు మొదలుకుని నేటి ఆధునిక మానవులను భద్రకాళి చెరువు, చుట్టూ ఉన్న గుట్టలు ఆకర్షిస్తున్నాయి భద్రకాళి చెరువు అంచున ఆదిమానవులు జీవించిన గుహలు, చెరువు మధ్యలో ద్వీపంలా ఉండే గుట్టపై రాతి పనిముట్ల పరిశ్రమ, బృహత్ శిలాయుగం నాటి సమాధులు, కాకతీయుల నాటి సైనికుల కోట వెనుక నుంచి రహస్య మార్గం, ఆ మార్గం నుంచి చెరువులోకి దిగడానికి వీలుగా ఉన్న మెట్ల మార్గాన్ని ప్రతాప్ హేమంతులతో కలిసి నూతన చారిత్రక ఆధారాలను గతంలోనే గుర్తించారు.

● హనుమద్గిరి తటాకాంజనేయస్వామి దేవాలయం వెనుక నుంచి చెరువులోకి దిగితే రెండు శిలలపై చెరువు ముఖంగా శిల్పకళ ఉట్టిపడే విధంగా రాష్ట్రకూటుల కాలం నాటి వినాయకులు, చాముండీదేవి శిల్పాలు, రైలింగ్ మధ్యలో ఉన్న శివలింగాలు, నందివిగ్రహాలు, సూర్యుడి శిల్పాలు కనిపిస్తాయి.


సిద్ధుల గుట్టలో చిన్నపాటి బండరాళ్లపై ఉన్న పరుపుబండ

ఆనవాళ్లు

● ఈ శిల్పాలపై భాగంలో విశాలమైన ఒక గుహ ఉంది. ఈ గుహలో 12000 సంవత్సరం నుంచి 2000 సంవత్సరం మధ్యకాలంలో ఆదిమానవులు తలదాచుకున్నట్టు తెలుస్తోంది. గుహలోపల పెద్ద పెద్ద ఇటుకలు ఉండడంతో ఈ గుహలో సిద్ధులు లేదా రుషులు నివసించేవారని చారిత్రక ఆధారాలు తెలియజేస్తున్నాయి.

● గుహ ముందు భాగంగా కోడిగుడ్డు ఆకృతిలో ఉన్న రెండు గ్రూవ్ ఉన్నాయి.


గుట్ట ఎక్కడానికి తొలిచిన మెట్లు


బ్రాహ్మణాల సమయంలో గుట్టపై తొలిచిన బద్దలు

● గుహ ముందు నుంచి గుట్ట చివరి అంచు నిర్మించబడిన కోట గోడలు కనిపిస్తాయి. ఇక్కడ కుడి వైపు నుంచి కాకతీయుల పాలకులు నిర్మించిన కోట లోపలి వైపు వెళ్లడానికి రహస్య మార్గం ఉంది. ఈ మార్గం గుండా సైనికులు చెరువులోకి దిగి స్నానాలు చేసి దాహార్తిని తీర్చుకోవడానికి వీలుగా శిలకు తొలిచిన మెట్లు ఉన్నాయి.

● చెరువు వైపు దిగువన ఏటవాలుగా ఉన్న శిలపై ఆలయం నిర్మించే ప్రయత్నాలు చేసినట్టు తొలిచిన పునాదులు సాక్ష్యంగా ఉన్నాయి.

● ఈ ఆలయ రాతి పునాదుల పక్కన శిలకు అసంపూర్ణంగా చెక్కిన భైరవ శిల్పం ఉంది.

● సిద్ధుల గుట్ట వెనుక వైపు భద్రకాళి చెరువు మధ్యలో ద్వీపంలా ఉన్న గుట్టపై నవీన శిలాయుగం నాటి ఆదిమానవులు రాతి పనిముట్లను తయారు చేసుకున్న పరిశ్రమ ఉంది. యాభైకి పైగా గ్రూవ్ (పొడవైన బద్దులు) ఉన్నాయి.

● గుట్ట పూర్తి ఉపరితలంలో సమతల ప్రదేశంలో బృహద్ శిలాయుగం నాటి డాల్మెన్ సమాధి ఉంది. చెరువులో రాక్షస గూళ్లను పురావస్తు శాఖ గతంలో గుర్తించింది. పురావస్తు శాఖ సమగ్ర పరిశోధన చేస్తే భద్రకాళి చెరువు, చెరువు చుట్టూ ఉన్న గుట్టలు పర్యాటకులను మరింత విశేషంగా ఆకట్టుకుంటాయని రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ములుగు
గురువారం 19 డిసెంబరు 2024

రోడ్డు విస్తరణ సరే.. ముంపు మాటేంటి?

● బండారుపల్లి రోడ్డు వెడల్పు పనుల్లో అనాలోచిత నిర్ణయం ● ఇష్టానుసారంగా డ్రెయినేజీల నిర్మాణం ● కృష్ణకాలనీ-1, బీడీ వర్కర్స్ కాలనీలకు ముంపు ముప్పు


రోడ్డు విస్తరణ కోసం యంత్రాలతో నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నీరు పల్లానికి పారడం ధర్మం.. కానీ అదే నీరు ఇళ్లను ముంచితే..! వరదకు దారిచూపే యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే..! ఇప్పుడు ఇదే పరిస్థితి జిల్లాకేంద్రంలో నెలకొంది. అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ అనాలోచిత నిర్ణయం రెండు కాలనీలకు ముప్పుగా మారుతోంది. ములుగులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల కూడలి 163జాతీయ రహదారి నుంచి బండారుపల్లి వైపు రూ.6కోట్లతో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈఏడాది సెప్టెంబరు 12న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క శంకుస్థాపన చేయగా కిలోమీటర్ పొడవునా నాలుగు లేన్‌లుగా రహదారిని అభివృద్ధి చేస్తున్నారు. మార్కింగ్ చేసే విషయంలోనే అధికారులు, కాంట్రాక్టర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ ఆస్తులను కాపాడుతూ ప్రైవేటు స్థలాల వైపునకు కూల్చివేతలకు పాల్పడ్డారు. ఈరోడ్డులోనే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పంచాయతీరాజ్, జడ్పీ, ఎస్పీ, ఆర్‌అండ్‌బీ, అగ్నిమాపక, విద్యుత్‌శాఖ కార్యాలయాలు ఉన్నాయి. రోడ్డు మధ్య నుంచి ప్రభుత్వ కార్యాలయాలున్న చోట 40ఫీట్లు, ప్రైవేటు స్థలాలు, ఇండ్లు ఉన్న చోట 45ఫీట్లకు మార్కింగ్ చేసి కూల్చివేతలు చేపట్టారు. దీంతో స్థానికుల నుంచి నిరసన వ్యక్తమైంది. ఆలస్యంగా స్పందించిన అధికారులు యజమానులను ఒప్పించి సమస్యను సద్దుమనిగేలా చేశారు. కానీ, ఇప్పుడు కొత్త సమస్య ఉత్పన్నమైంది. రహదారికి ఇరువైపులా నిర్మిస్తున్న డ్రైనేజీ పనుల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. మురుగు, వరద నీరు వెళ్లేలా క్రిష్ణకాలనీ-1, పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయం వద్ద కాల్వలను మళ్లించారు. కాలనీలో ప్రస్తుతమున్న డ్రైనేజీ వెడెల్పు తక్కువగా ఉండటం, పూడిక పేరుకుపోవడంతో రాబోయే రోజుల్లో వరద నీరంతా కాలనీని ముంచెత్తే అవకాశముంది. జాతీయ రహదారివైపు ఉన్న 8ఫీట్ల డ్రైనేజీకి ఈ కాల్వలను అనుసంధానించే అవకాశమున్నప్పటికీ అధికారులు పట్టించు కోవడం లేదు. బండారుపల్లి-బుద్దారం దారిలో జీవంతరావుపల్లి క్రాస్ వద్ద డ్రైనేజీ నిర్మాణం ముగుస్తుండగా వరద నీరంతా సమీపంలోని బీడీ వర్కర్స్ కాలనీ వైపుకు ప్రవహించనుంది. దీంతో ఈ కాలనీ కూడా ముంపునకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. ఇక్కడున్న కల్వర్టుకు డ్రైనేజీని అనుసంధానించి జీవంతరావుపల్లి రోడ్డు వైపుకు మళ్లించే అవకాశమున్నా అధికారులు స్పందించడం లేదు. మదర్సా వరకు డ్రైనేజీని విస్తరించినా సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఈవిషయమై సోమవారం క్రిష్ణకాలనీ-1వాసులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

సమస్యను పరిష్కరిస్తాం : వెంకటేశ్, ఆర్‌అండ్‌బీ ఈఈ

ప్రజల అభ్యంతరాలపై పరిశీలన జరుపుతాం. నిధుల మంజూరు మేరకే పనులు చేస్తున్నాం. డ్రైనేజీ సమస్యను సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు కృషిచేస్తాం.


బీడీ వర్కర్స్ కాలనీ సమీపంలో అసంపూర్తిగా వదిలేసిన డ్రైనేజీ కాల్వ

ఇదేం దోపిడీ?

(5వ పేజీ తరువాయి)

గుంజుతున్నారని వాహన చోదకులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో సగటున రోజుకు రెండు వందలకు పైగా ఇసుక లారీలు వచ్చి వెళ్తుంటాయని చెబుతున్నారు. టెండర్ నిబంధనలకు విరుద్ధంగా ఇలా ఫీజులు వసూలు చేస్తే పాట పాడిన మొత్తాన్ని పంచాయతీకి జమ చేయాలని, అంతేకాకుండా టెండర్ను కూడా రద్దు చేయడం జరుగుతుందని నిబంధనల్లో స్పష్టంగా పేర్కొన్నారు. అలాగే కాంట్రాక్టర్ ఎంట్రీ పార్కింగ్ ఫీజులు వసూలు చేయడం కోసం అవసరమైన రసీదు బుక్కులను, పార్కింగ్ స్థలాన్ని, విద్యుత్ సదుపాయం, త్రాగునీటి వసతులను అతడే స్వయంగా ఏర్పాటు చేసుకోవడంతో పాటు, ఆర్టీసీ బస్ స్టేషన్ ఈవో కార్యాలయాలకు వెళ్లే మార్గాల్లో కమాన్ జడ్పీ పాఠశాల ప్రాంతాల్లో నిబంధనలకు అనుగుణంగా తాళ్లను ఏర్పాటు చేసుకొని ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా ఫీజులు వసూలు చేసుకోవాలని సూచించారు. కానీ ఇవేవీ తనకు పట్టనట్లుగా సదరు గుత్తేదారు మనుషులను ఏర్పాటు చేసుకొని స్టాంపులు లేని రసీదులను అంటగడుతూ ఫీజులు గుంజుతున్నారని చెబుతున్నారు. ఈ అడ్డగోలు దారి దోపిడీని నియంత్రించేందుకు ఎప్పటికపుడు నిఘా ఉంచాల్సిన పంచాయతీ సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటం అనేక అనుమానాలను తావిస్తోంది.

భూ కుంభకోణంపై నిఘా వర్గాల ఆరా

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన "కుంబకోణం కలకలం" కథనం చర్చనీయా ంశంగా మారింది. 2021లో సిమెంటు కంపనీకి జరిగిన ఒప్పంద పత్రాల అంశం తెరపైకి వచ్చింది. దీనిపై నిఘావర్గాలు సైతం కూపీలాగు తున్నాయి. ఈఘటనపై విచారణ కొనసాగుతన్న నేపథ్యంలో పలిమెల తహసీల్దార్ మూడు రోజుల సెలవుపై వెళ్లినట్లు తెలిసింది. భారీభూకుం భకోణంలో వివరాలను అందించాల్సిన సదరు అధికారి అందుబాటులో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. కాగా భూరిజిస్ట్రేషన్లను ఓప్రైవేటు రూంలో చేశారనే అంశంపై కలెక్టర్ రాహుల్ శర్మ ప్రత్యేక నిఘా పెట్టి సమాచారాన్ని సేకరించినట్లు తెలుస్తుంది. ఐపీ అడ్రస్ ద్వారా ఎక్కడ రిజిస్ట్రేషన్లు చేశారో గుర్తించి ఈసమాచారాన్ని సీసీఎల్‌ఏకు నివేదించినట్లు విశ్వసనీయ సమాచారం.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

మేడారం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారం, నార్లాపూర్, వెంగళాపూర్, ఊరట్టం గ్రామ పంచాయితీల పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను జిల్లా పంచాయతీరాజ్ అధికారి దేవరాజ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిపివో మాట్లాడుతూ ఎవరి ప్రాబల్యాలకు, ఒత్తిడికి ఇబ్బంది పడకుండా నిష్పక్షపాతంగా సర్వే పూర్తి చేయాలని కమిటీ సభ్యులకు, సర్వే సిబ్బందికి సూచించారు. సర్వేలో చూపిన వివరాలు పూర్తిగా సూచించాలని ఆదేశించారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్ల అరెస్టును ఖండించాలి

ములుగు కలెక్టరేట్/వెంకటాపూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ ధర్నాకు తరలివెళ్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ల అక్రమ అరెస్టును ప్రతి ఒక్కరూ ఖండించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకుడు జయరాజులు అన్నారు. బుధవారం ములుగు, వెంకటాపూర్‌లో పోలీసులు సబ్‌స్టేషన్ ఆపరేటర్లను అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా రాజేందర్, జయరాజులు మాట్లాడారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సబ్‌స్టేషన్ ఆపరేటర్లను గుర్తించి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయినవారిలో సుధాకర్, రాజు, రఘుపతి, సురేష్, మధు, పవన్, రమేష్, సాయిబాబు, గోవర్ధన్, సతీష్, విజయ్, శ్రీధర్, అశోక్ ఉన్నారు.

హమాలీ కార్మికుల అరెస్టు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలు పెంచాలనే లక్ష్యంతో చలో హైదరాబాద్ కార్యక్రమానికి సిద్ధమవుతున్న సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులను స్థానిక పోలీసులు బుధవారం అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నాయకుడు ముత్యాల రాజు మాట్లాడారు. అరెస్టు అయినవారిలో సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు మొలుగూరి రాంబాబు, రొంటాల రమేష్, ఇనుముల భిక్షపతి, రఘు, ఓరుగంటి రవి, కుమార్, సుమన్, నరేష్, భిక్షపతి తదితరులు ఉన్నారు.

ఘనంగా జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ పోటీలు

కాటారం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ పోటీలు ఘనంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి 200 మందికి పైగా అథ్లెటిక్స్ క్రీడాకారులు పాల్గొన్న పోటీలను కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించి దగ్గరుండి క్రీడాకారులను ప్రోత్సహించారు. బాలబాలికలు, యువతీయువకులకు అండర్-16, 18, 20విభాగాల్లో 2కి.మీ, 4కి.మీ రన్నింగ్ పోటీలు నిర్వహించగా పలువురు క్రీడాకారులు తమ సత్తా చాటారు. పోటీలకు ముఖ్య అతిథిలుగా విచ్చేసిన సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలుగా ఉన్న పలువురు క్రీడాకారులు ప్రతిభ చాటారన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో మెన్, ఉమెన్ అన్ని విభాగాల్లో ఎంపిక చేసిన 32మంది క్రీడాకారులు నాగర్‌కర్నూల్‌లో ఈ నెల 22న జరిగే రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో పాల్గొంటారని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ పంతకాని సమ్మయ్య, అధ్యక్షుడు పొక్కూరి చిన్నరాజయ్య, జిల్లా కార్యదర్శి పూతల సమ్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు బెడిక రాజయ్య, సాంబమూర్తి, ప్రసాద్, పసుల రవి, ఐశ్వర్య, అజయ్, కరుణాకర్‌రావు, మార్క రాము, ఎంఈవో శ్రీదేవి, పలువురు పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.


రన్నింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన


మాట్లాడుతున్న సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా వ్యతిరేఖ పాలన కొనసాగుతుందని సేవాలాల్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబునాయక్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సేవాల్‌సేన ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజా రగ్ జోల్ బుధవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా సేవాల్ సేన జిల్లా అధ్యక్షుడు భూక్య సురేష్ నాయక్ ఆధ్వర్యంలో రాంబాబు నాయక్‌కు ఘన స్వాగతం పలికారు. 5 ఇంక్లైన్ కమాన్ నుంచి డప్పు చప్పుళ్లతో ర్యాలీగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌కు చేరుకొని అంబేద్కర్‌కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షలు గుగులోతు సంతోష్ నాయక్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శారదాబాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి వాలునాయక్, రామస్వామి నాయక్ పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు

మంగపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీ సీతారామాచంద్రస్వామి దేవాలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. ఈ నెల 15న ప్రారంభమైన ఈ ఉత్సవాలు నెల రోజుల పాటు నిత్యం పలురకాల అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలను ఆయా ఆలయాల అర్చకులు శాస్త్ర ప్రకారంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని కమలాపురం, బోరునర్సాపురం, చెరుపల్లి, తిమ్మంపేట, మల్లూరు, అకినేపల్లి- మల్లారం తదితర గ్రామాలలో గల శ్రీ సీతారామాచంద్ర స్వామి దేవాలయాలల్లో ఉత్సవాలు జరుగుతున్నాయి. కార్యక్రమాలలో ఆలయ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల ప్రముఖుల పాల్గొన్నారు.

క్రీడల్లో ఎస్టీ గురుకుల విద్యార్థుల ప్రతిభ

కాటారం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని ఎస్టీ బాలికల గురుకుల విద్యార్థులు సీఎంకప్-2024 జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. బాలికల విభాగంలో జిల్లా స్థాయిలో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించినట్లు ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, పీడీ గౌతమి బుధవారం తెలిపారు. గురుకుల విద్యార్థులు పలువురు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, చెస్, డిస్కస్ త్రో, బేస్‌బాల్ లో ప్రథమ స్థానం, షాట్‌పుట్‌లో రెండో స్థానం సాధించి తమ సత్తా చాటారు. లాంగ్‌జంప్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు, రన్నింగ్ 100, 400మీటర్ల విభాగంలో మొదటి స్థానంతో సత్తా చాటారు. గురుకులానికి చెందిన 21మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభతో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ తెలిపారు. ఖో-ఖోలో నందిని, ఉమశ్రీ, యోగిత, కబడ్డీ లో బిందుప్రియ, నందిని, నవ్యశ్రీ, శ్రీవర్ష, వాలీబాల్‌లో పూజిత, రిషిత, బేస్‌బాల్‌లో సాయికీర్తన, శ్రీలేఖ, కళ్యాణి, సుచరిత, ప్రణీత, సంజన, జోత్న్సశ్రీ, డిస్కస్‌త్రోలో బిందుప్రియ, లాంగ్‌జంప్‌లో పావనిశ్రీ, షాట్‌పుట్‌లో సాయికీర్తన, రన్నింగ్ 100, 400మీటర్లు నందిని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, పీడీ గౌతమి, సరిత అభినందించారు.

విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలి


విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఈవో పాణిని

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గణితం నిజజీవితంలో ఎంతో ప్రాధాన్యత కలిగిన అంశమని, విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే గణితంపై పట్టు సాధించి తమ భవిష్యత్తును బాగు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవంలో భాగంగా జిల్లాస్థాయి గణిత ప్రతిభా పోటీలు గణితఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏళ్ల మధుసూదన్, చందా భద్రయ్యల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ పోటీలకు డీఈవో పాణిని ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ ప్రశంసాపత్రాలు అందజేశారు. డీసీఈబీ సెక్రటరీ ఇనుగాల సూర్యనారాయణ, టీఎంఎఫ్ రాష్ట్ర బాధ్యులు డాక్టర్ కందాల రామయ్య, సెక్టోరియల్ అధికారి గుల్లపెల్లి సాంబయ్య, జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్, ఏఎస్‌సీవో సైకం శ్రీనివాసరెడ్డి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క్యాతం రాజేందర్, సైన్స్‌ఫోరం అధ్యక్షుడు శిరుప సతీష్‌కుమార్, గణితఫోరం జిల్లా సభ్యులు వెంకటశ్రీనివాస్, సుతారి మురళి, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల బృందం దాడులు

మంగపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపురం మేజర్ జీపీలో విద్యుత్ విజిలెన్స్ అధికారుల బృందం బుధవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించిందని మంగపేట మండల విద్యుత్ ఏఈ సుబ్బరావుశర్మ తెలిపారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విలేకర్లతో ఏఈ మాట్లాడుతూ కమలాపురంలో కేబుల్, జియో కేబుల్ నెట్‌వర్క్ 3477 సర్వీస్ నంబర్‌పై రూ, 4.60 లక్షలు బకాయిలు ఉండడంతో విద్యుత్ కనెక్షన్ తొలగించినట్లు వెల్లడించారు. 2024 డిసెంబరు 12న, స్కైవిజన్ నెట్‌వర్క్ నుంచి దంతులూరి వెంకటేశ్వర్‌రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కమలాపురంలో ఉమ్మడిగా బలరాం, మాదవచారి, శ్రీనివాస్, ఉమాశంకర్ అనే వ్యక్తులు పదేళ్లుగా కేబుల్ టీవీ ప్రచారాలు చేసి టిజిఎస్పీడీపీఎల్‌కు సంబంధించిన నోడ్స్, ఆంప్లీఫ్లేయర్స్, పవర్ పాస్ యూనిట్లకు విద్యుత్ సరఫరా చేసుకుంటున్నారు. డీపీఈ వింగ్ విజిలెన్స్ అధికారులు బుధవారం గ్రామంలో దాడులు నిర్వహించి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు గుర్తించారు. దాడులు నిర్వహించిన డీపీఈ, విజిలెన్స్ వింగ్ అధికారులు ఈ విషయాన్ని విద్యుత్ శాఖ ఎస్ఈ, డీఈ, ఏడీఈలకు సమాచారం అందించి నాలుగు రోజులు సమయం ఇచ్చినట్లు తెలిపారు. ఈ విషయంపై స్కైవిజన్ ఫిర్యాదు మేరకు జియో నెట్‌వర్క్ యాజమాన్యానికి నోటీసులు అందజేశామని పేర్కొన్నారు. నాలుగు రోజుల్లో రూ, 4.60 లక్షలు బకాయిలు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలోనే భూ కుంభకోణం

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : పలిమెల శివారులో భూకుంభకోణం వ్యవహారంలో మంత్రి శ్రీధర్‌బాబు ఆయన తమ్ముడు శ్రీనుబాబు పాత్ర ఉందంటూ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. బుధవారం మహదేవపూర్, పలిమెల మండల కేంద్రాల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాప, పలిమెల మండలాధ్యక్షుడు గుండెబోయిన చిన్నన్న మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఓ సిమెంటు కంపెనీకి ప్రస్తుతం అమ్ముకున్న వారి పేర్లు ఎక్కించేందుకు మీరు సహకరి ంచింది వాస్తవం కాదా అని మండిపడ్డారు. మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజిరెడ్డి, సునిత, ముత్తారం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కిషన్ రెడ్డి అన్నకూతురు అనిత, రవీందర్ సహా పలువురు బీఆర్ఎస్ నాయకుల పేర్లు ప్రస్తావించకుండా కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరి నాయకుల పేర్లు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కాగజ్‌నగర్ బీఆర్ఎస్ నాయకులు పుట్ట మధూకర్ ప్రమేయంతోనే ఒప్పందాలు కుదుర్చుకున్న మాట వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. భూముల వ్యవహారంలో మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశిస్తే అక్రెడిట్ ఎక్కడ తమ దక్కుతుందోనని పలిమెలలో ప్రెస్‌మీట్ పెట్టారని ఆరోపించారు. పార్టీ అధ్యక్షుడు అక్బర్‌ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ సల్ల తిరుపతయ్య మాట్లాడుతూ పలిమెల రైతులు కాస్తులో ఉన్నారంటే అది శ్రీధర్‌బాబు చొరవే అని అన్నారు. సిమెంట్ కంపెనీకి రిజిస్ట్రేషన్ చేసిన తహసీల్దార్‌పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు వామన్‌రావు, విలాస్‌రావు, అశోక్, అస్రరర్, మాజీ జడ్పీటీసీ గుడాల అరుణ, ఆకుతోట సుధాకర్, శ్రీనివాస్ రెడ్డి, రాంమోహన్, కోట సమ్మయ్య, సలావోద్దిన్, నయీంఖాన్, హరిష్, ధర్మయ్య, పలిమెలలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పార్టీ అధ్యక్షుడు గుండెబోయిన చిన్నన్న, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేందర్, జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, బొచ్చు శ్రీనివాస్, సారయ్య, తదితరులున్నారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి):గత 50ఏళ్లుగా పలిమెలలో భూములు దున్నుకుంటున్న రైతులను బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి వచ్చిన తర్వాత అనుభవదారు కాలమ్ నుంచి తొలగింపజేసి వారికి అన్యాయం చేసింది పుట్ట మధేనని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ప్రచార కమిటీ చైర్మన్ కుంభం రమేష్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద వారు కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు మహేష్, అశోక్, అజీజ్, విక్రమ్, కుమార్, రాజు, రాజునాయక్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఐలాపూర్ జాతరకు నిధులు కేటాయించాలి

కన్నాయిగూడెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ఐలాపూర్‌లో రెండేళ్లకు ఒకసారి జరిగే సమ్మక్క సారక్క జాతరకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలని తుడుందెబ్బ రాష్ట్ర కో క న్వీనర్ పొడెం బాబు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన ఐలాపూర్‌లోని సమ్మక్క సారక్క తల్లులను దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోర్లు , పైప్ లైన్ లిఫ్టింగ్ ద్వారా గుడి చుట్టు పక్కల నల్లాలు ఏర్పాటు చేసి జాతరకు వచ్చే భక్తులకు తాగునీరు అందించాలని తెలిపారు. తుడుందెబ్బ మండల అధ్యక్షుడు గుండ్ల పాపారావు, కోరం సంపత్, వాసం లక్ష్మయ్య, వట్టం సదాన్ డు పాల్గొన్నారు.

వాహనం బోల్తా.. ఇద్దరికి గాయాలు

చిట్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నైన్‌పాక శివారులో టాటా ఏస్ వాహనం బుధవారం సాయంత్రం పల్టీ కొట్టిన ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పరకాల నుంచి మండలంలోని అందుకుతండాకు వస్తున్న టాటా ఏసీ వాహనం గ్రామ శివారులో ప్రమాధవాశత్తు అదుపుతప్పి బోల్తా పడింది. వాహనంలో ఎనిమిది మంది ప్రయాణికులు ఉండగా భూక్య సతీష్, దామరశెట్టి వీరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 పైలట్ కట్కూరి శ్రీనివాస్, ఈఎంటీ తడక నగేష్ క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు.

సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం చేపట్టిన సర్వేను అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. భూపాలపల్లి పట్టణంలోని 1వ వార్డు, 16వ వార్డులలో ఆమె స్వయంగా తిరిగి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ స్థలాలను ఆమె పరిశీలించారు. సర్వే చేస్తున్న విధానాన్ని గురించి అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురికి ఆమె స్వయంగా ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పన కోసం పరిశీలన

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం బుధవారం అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, కమిషనర్ రాజేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలతో మాట్లాడి వారి సమస్యలను గురించి అడిగితెలుసుకున్నారు. పాఠశాలలో మంచినీటి సౌకర్యం నుంచి మొదలుకుని, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య పనుల వరకు బాగుండేలా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు.

అక్రమ అరెస్టులు సరికాదు..

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలీసుల అక్రమ అరెస్టులను ప్రజలు, ప్రజాస్వామికవాదులు తీవ్రంగా ఖండించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ తెలంగాణ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు గడ్డం సదానందం బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఇటీవల కార్యదర్శులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళనలు చేస్తేకార్యదర్శులను, విద్యార్థులను అక్రమంగా అరెస్టులు చేయడం దారుణమన్నారు. హైదరాబాద్ లోని ఇందిరా పార్కు వద్ద ఆందోళనలు చేస్తామంటే అక్కడా వదిలి పెట్టలేదని అన్నారు. కాగా అక్రమ అరెస్టులను నిలిపివేసి అడిగిన వారికి సరైన న్యాయం చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు.

మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుల వినతి

మొగుళ్లపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పీఎంటీఏ టీఎస్ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ పిలుపుమేరకు మండలంలోని కొరికిశాల మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులు చేపట్టిన ఐదోరోజు నిరసనలో భాగంగా బుధవారం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ సునీత, ఎంపీడీవో మహబూబ్ హుస్సేన్‌లకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులు అమరేష్, రాజ్‌కుమార్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పశుసంపదతోనే వ్యవసాయం అభివృద్ధి

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : పశుసంపదతోనే వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సూర్‌వైజర్ రాఘవ అన్నారు. బుధవారం బెగ్లూర్‌లో నిర్వహించిన ఉచిత పశువైద్య శిభిరంలో మండల పశువైద్యాధికారి రాజబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృత్రిమ గర్భధారణ ద్వారా ఆడదూడలను అభివృద్ధి చేయవచ్చన్నారు. గోపాల మిత్రలు రాజబాబు, ముదాషీర్, బానయ్య, కిషన్, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఇసుక టిప్పర్లు పట్టివేత

టేకుమట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామ శివారులోని కలికోటపల్లిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం కలికోటపల్లి శివారులో ఇసుకను డంపు చేసి రాత్రి సమయంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు రెవెన్యూ, పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. కాగా కలికోటపల్లి శివారులో డంపుచేసిన ఇసుకను తరలించేందుకు టిప్పర్లలో లోడ్‌చేస్తూ పట్టుపడ్డారని తెలిపారు. కాగా పట్టుబడిన రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకోని టిప్పర్ల డ్రైవర్లు పెద్దపల్లి జిల్లా బసంతపూర్‌కి చెందిన బత్తుల రాములు, దారంగుల వసంత్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

రేగొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారి 363 పక్కన ఉన్న డ్రైనేజీపై నిర్మించిన అక్రమ కట్టడాలను పంచాయితీరాజ్ అధికారులు బుధవారం తొలగించారు. గత కొన్నేళ్లుగా డ్రైనేజీని ఆక్రమించి హోటల్, రేకుల షెడ్‌లు వేసి దుకాణాలు నిర్వహిస్తుండడంతో ఇండ్లలో నుంచి వచ్చే మురుగు రోడ్లపై నిలుస్తోంది. దీంతో స్థానికులు పలుమార్లు ఎంపీడీవో, పంచాయితీ కార్యదర్శులకు ఫిర్యాదులు చేశారు. ఈ క్రమంలో ఫిర్యాదులపై స్పందించిన ఎంపీడీవో దుకాణాలను తొలగించాలని నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. అయినా తొలగించకపోవడంతో పోలీసుల సహకారంతో జేసీబీతో నిర్మాణాలను తొలగించారు. ఈ క్రమంలో అక్రమ నిర్మాణం చేపట్టిన వారు అధికారులతో వాగ్వాదానికి దిగారు వెంటనే పోలీసులు దుకాణదారులను పోలీస్‌స్టేష న్‌కు తరలించారు.

పశుగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

మొగుళ్లపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత నవంబరు నుంచి చేపట్టిన 21వ పశుగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కుమారస్వామి అన్నారు. బుధవారం మొగుళ్లపల్లి, మొట్లపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పశువైద్యకేంద్రాలతోపాటు వేములపల్లి సబ్‌సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయన హాజరు రిజిష్టర్లతోపాటు సర్వేను పరిశీలించారు. ఆయన వెంట జూనియర్ పశువైద్యాధికారి వెంకటేష్, పశువైద్య సహాయకురాళ్లు స్రవంతి, శారద, గోపాలమిత్రలు శ్రీనివాస్, రాజేందర్, తదితరులు ఉన్నారు.

మైనారిటీ మహిళలు దరఖాస్తు చేసుకోవాలి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మైనారిటీ మహిళలు ఇందిరమ్మ మహిళాశక్తి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి సీహెచ్.రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ పొందిన మైనారిటీలకు ప్రభుత్వం గుర్తింపు పొందిన శిక్షణ సంస్థల ద్వారా టైలరింగ్ కోర్సులు, సాధికారత, సాధికారత కోసం వారి నైపుణ్యాలను అప్‌గ్రేడ్ చేయాలనే ఉద్దేశంతో ఉచిత గృహ కుట్టుయంత్రాలను అందజేస్తున్న ప్రత్యక్ష లబ్ధిదారుల పథకాన్ని ప్రకటించిందని అన్నారు. జిల్లాలోని అర్హులైన నిరుపేద మైనారిటీ మహిళలు ఈనెల 31వతేదీలోపు ఆన్‌లైన్‌లో టీజీవోబీఎంఎంఎస్ వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం అవసరమైన పత్రాలతోపాటు జీకార్స్‌కాపీని ములుగులోని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు 9989661146 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఇసుక సొసైటీ నిర్వహణకు ఆమోదం

వాజేడు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వాజేడు మండలంలోని టేకులగుడెంలో నిర్వహించే ఇసుక సోసైటీ నిర్వహణకు గ్రామసభ ఆమోదం పొందింది. బుధవారం గ్రామంలో పెసా గ్రామసభను ఎంపీడీవో విజయ, ఎంపీవో శ్రీకాంత్ నాయుడులు నిర్వహించారు. భీష్మాశంకరుడు ట్రైబల్ మహిళా ఇసుక క్వారీ లేబర్ కాంట్రాక్టు ఎంసీఎస్ సోసైటీ సభ్యులకు ఇసుకను తవ్వేందుకు గ్రామస్థులు చేతులు లేపి తమ ఆమోదాన్ని తెలిపారు. ఇసుక సోసైటీ ఆమోదం ఓటర్లలో మూడో వంతు143 మందికి పైగా అనుకూలంగా ఆమోదం తెలపడంతో ఇసుకసోసైటీ నిర్వహణకు ఆమోదం లభించిందని అధికారులు పేర్కొన్నారు.